అబద్ధాల సీఎం అశోక్‌నగర్‌కు రా..?

- నేనే 65 వేల ఉద్యోగాలిచ్చానని చెప్పు
- సీఎం రేవంత్‌రెడ్డికి ఓ నిరుద్యోగి సవాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : అబద్ధాల సీఎం అశోక్‌నగర్‌కు రా.. నేనే 65 వేల ఉద్యోగాలిచ్చానని అశోక్‌నగర్‌లో చెప్పు.. అని ఓ నిరుద్యోగి సోమవారం ఎక్స్ వేదికలో సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరాడు. 65 వేల ఉద్యోగాలు తానే ఇచ్చానని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి.. అశోక్‌నగర్‌కు వచ్చి అదే మాట చెప్పగలవా..? అని నిలదీశాడు. ప్రతి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి, చివరకు 65 వేలు అని చెబుతున్నావని విమర్శించాడు. ఆ 65 వేల ఉద్యోగాల్లో కేసీఆర్ ఇచ్చినవే 30 వేలకు పైగా ఉన్నాయని పేర్కొన్నాడు. గతంలో కేసీఆర్ నోటిఫికేషన్లు వేసి.. ఫలితాలు విడుదలయ్యాక కోర్టు కేసులతో ఆగిపోతే, ఆ తర్వాత ఎల్బీ స్టేడియంలో నియామకపత్రాలిచ్చి ఆ ఉద్యోగాలు నేనే ఇచ్చానని సిగ్గులేకుండా చెప్పుకుంటున్నాడని మండిపడ్డాడు. ఏదో చేస్తావని భావించి.. నీకు ఓట్లేసి గెలిపిస్తే, ఇప్పుడేమో నిరుద్యోగులను లెక్కచేయడం లేదని నిరుద్యోగ యువకుడు నిప్పులు చెరిగాడు. ఈ వీడియో సోమవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు 5 లక్షలు

- ప్రత్యేకంగా 'ప్రవాసీ ప్రజావాణి' కౌంటర్: సీఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలో పనిచేస్తున్న వారిని గల్ఫ్ కార్మికులుగా గుర్తించింది. సోమవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గల్ఫ్‌లో కార్మికులు మరణిస్తే వారి కుటుంబసభ్యులకు రూ.5 లక్షల పరిహారం అందించనున్నది. బాధితుల కోసం ప్రత్యేకంగా ప్రజావాణిలో 'ప్రవాసి ప్రజావాణి' పేరుతో కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నది.

ఇద్దరు మున్సిపల్ కార్మికుల ఆత్మహత్యాయత్నం

- చేసిన పనికి జీతాలు ఇవ్వడం లేదని మనస్తాపం
- వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ ఆఫీసులో ఘటన
- పెండింగ్ జీతాలు చెల్లించాలని అయిజలో ఆందోళన

అయిజ మున్సిపల్ కార్యాలయ సమీపంలో నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

యాలాల/అయిజ, సెప్టెంబర్ 16: చేసిన పనికి జీతాలు ఇవ్వకపోవడంతో ఇద్దరు కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన సోమవారం వికారాబాద్ జిల్లాలోని తాండూరులో జరిగింది. తాండూరు మున్సిపల్‌లో నర్సింహులు, జ్యోతితోపాటు మరో ఏడుగురు ఓ బృందంగా ఏర్పడి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. మిగిలిన వారికి జీతాలు వచ్చాయి. కానీ నర్సింహులు, జ్యోతికి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. పెట్రోలు డబ్బాతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆత్మహత్యాయత్నం చేశారు. మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ఏర్పాటు చేసుకున్న గ్రూప్‌లో వారి పేర్లు లేవని, అందువల్లే వారికి జీతాలు ఇవ్వలేదని చెప్పారు. ప్రజా పాలనలో కలెక్టర్‌కు దరఖాస్తు ఇస్తే అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పెట్రోల్ డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో పనిచేసే ఔట్ సోర్సింగ్ కార్మికులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో నీటి విభాగం, హరితహారం, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 86 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలిస్తున్నదే తప్పా.. ఆచరించడం లేదని చెప్పారు. జూలై, ఆగస్టు నెలల జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని వాపోయారు. జీతాలు సకాలంలో చెల్లించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వచ్చే నెల నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు

- వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జారీ
- జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు స్మార్ట్ రేషన్‌కార్డులు, స్మార్ట్ హెల్త్‌కార్డులను విడివిడిగా అందజేయనున్నట్టు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. కొత్త రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల జారీ కోసం సలహాలు, సూచనలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ సోమవారం మరోసారి భేటీ అయ్యింది. సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశానంతరం మంత్రులు ఉత్తమ్, శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్‌కార్డులు ఉన్నట్టు వెల్లడించారు. కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలను ఈ నెలాఖరులోగా పూర్తిచేసి, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పా రు. జనవరి నుంచి రాష్ట్రంలోని రేషన్‌కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తామని, సన్నవడ్లను పండించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను కూడా ఈ సీజన్ నుంచే అమలు చేస్తామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ భేటీ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అధ్యయనం చేసేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ సోమవారం జలసౌధలోనే ప్రత్యేకంగా భేటీ అయ్యింది. సబ్‌కమిటీ కో-చైర్మన్, సభ్యులుగా ఉన్న మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తోపాటు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి తదితరులు ఈ సమావేశంలో పాల్గొని సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలపై చర్చించారు.

వరదలతో కూలిన జైలు గోడలు.. ఖైదీల పరార్

న్యూఢిల్లీ: నైజీరియాలోని బోర్నో స్టేట్‌లో సంభవించిన వరదలతో మైదుగురి మీడియం సెక్యూరిటీ కస్టోడియల్ సెంటర్, దాని పక్కన ఉన్న స్టాఫ్ క్వార్టర్స్ గోడలు కూలిపోయాయి. దీంతో 81 మంది ఖైదీలు తప్పించుకుని, పారిపోయారు. వారిలో ఏడుగురిని పట్టుకున్నట్లు నైజీరియన్ కరక్షనల్ సర్వీస్ అధికార ప్రతినిధి అబుబకర్ ఉమర్ చెప్పారు. పారిపోయినవారిని గుర్తించామని, గాలింపు చర్యలు ప్రారంభించామని తెలిపారు. వరదల వల్ల 229 మంది ప్రాణాలు కోల్పోగా, 3,86,000 మంది నిరాశ్రయులయ్యారు.

- వలకు చిక్కిన భారీ చేప

లోయర్ మానేరు జలాశయంలో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ పరిధి సంగెంపల్లికి చెందిన మత్స్యకారుడు తిరుపతి వలకు 30 కిలోల భారీ చేప చిక్కింది. రోజులాగే సోమవారం చేపల వేటకు వెళ్లిన తిరుపతి.. తన వలలను తీస్తుండగా భారీ చేప కనిపించడంతో తిరుపతి ఆనందం వ్యక్తం చేశాడు. ఈ చేపను రామకృష్ణ కాలనీలో రూ.5 వేలకు విక్రయించాడు. -తిమ్మాపూర్

హాస్పిటల్ బ్రేక్‌ఫాస్ట్‌లో లక్క పురుగులు

- రోగుల ప్రాణాలతో కాంట్రాక్టర్ చెలగాటం
- అల్పాహారం ఎలా తినాలని రోగుల ఆగ్రహం
- జగిత్యాల ఎంసీహెచ్‌లో బయటపడ్డ నిర్లక్ష్యం

జగిత్యాల, సెప్టెంబర్ 16: దవాఖాన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగులకు అందించిన అల్పాహారంలో లక్క పురుగులు బయటపడ్డాయి. ఈ ఘటన సోమవారం జగిత్యాల మాతాశిశు కేంద్రంలో వెలుగుచూసింది. జగిత్యాలలోని ఎంసీహెచ్‌కు రోగుల తాకిడి ఎక్కువ. నిత్యం 100 మందికి పైగా బాలింతలు, వారి సహాయకులతో కిటకిటలాడుతది. ఇందులో ఇన్‌పేషెంట్లుగా చేరిన వారికి, వారి సహాయకులకు రోజూ పాలు, బ్రెడ్, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తారు. రోజు మాదిరిగానే.. ఉదయం అటుకుల అల్పాహారం ఇవ్వడంతో అందులో లక్కపురుగులు కనిపించాయి. దీంతో రోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మరీ ఇంత అధ్వానమా? దీనిని ఎలా తినాలి? అని మండిపడ్డారు. నాలుగు రోజులుగా నాసిరకం అల్పాహారం, ఉడికీఉడకని అన్నం అందిస్తున్నారని, తినలేకపోతున్నామని, ఒకవేళ తింటే వాంతులు, విరేచనాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పురుగుల టిఫిన్ పెట్టి రోగుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని? మీడియాకు సమాచారం అందించారు. సదరు కాంట్రాక్టరుకు 'నమస్తే తెలంగాణ' ఫోన్ చేయగా స్పందించలేదు.

అనుచరులతో కలిసి కార్ల ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే రోహిత్

మైనంపల్లి రోహిత్ కార్ల ర్యాలీపై చర్యలేవి?

- ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి డిమాండ్
- సోషల్ మీడియాలో కార్ల ర్యాలీ వీడియో వైరల్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మరో వివాదంలో చిక్కుకున్నారు. వందల కార్లతో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వెళ్తూ.. కారు ఓపెన్‌టాప్‌పై ఆయన, అనుచరగణం చేసిన స్టంట్లపై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. తక్షణం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం తన ఎక్స్ వేదికగా రోహిత్ ఓ వీడియో అప్‌లోడ్ చేశారు. అందులో తాను వందల కార్ల కాన్వాయ్‌తో రోడ్డు మొత్తం బ్లాక్ చేస్తూ వెళ్తున్నట్టు స్పష్టంగా ఉన్నది. ఆ వీడియోకు 'హరీశ్‌రావు ఇగ కాస్కో బిడ్డా.. మైనంపల్లి దెబ్బ..' అంటూ ట్యాగ్ లైన్ ఇచ్చారు. ఆ వీడియోలో.. రోహిత్ కారు ఓపెన్‌టాప్‌పై నుంచి అభివాదం చేస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగించారు. దీనికితోడు ఆయన అనుచరులు కార్ టాప్‌లపై హల్‌చల్ చేస్తున్నట్టు స్పష్టంగా కనిపించింది. ఓ ప్రజాప్రతినిధి అయ్యుండి.. తన ప్రవర్తనతో ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏమాత్రం బాగోలేదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'తక్కువస్థాయికి పడిపోతున్నావ్' అని, 'ఒక ఎమ్మెల్యేగా ఇలాంటి థర్డ్ క్లాస్ స్టంట్స్ చేయడానికి సిగ్గుండాలి. తెలంగాణలో న్యాయబద్ధమైన పాలన ఉన్నదా?' అంటూ ఓ నెటిజన్ డీజీపీని ట్యాగ్ చేశారు. 'ఇట్లాంటివి చేయడం హేళనకరం, ఇండియా కూటమికి ఓటు వేసిన ప్రజలు మూర్ఖులు' అంటూ మరో నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్లాంటి అసభ్య ప్రవర్తనలకు కూడా అనుమతి ఇస్తారా' అని కొరీనా సురేశ్ అనే నెటిజెన్ డీజీపీని ట్యాగ్ చేశారు. 'ఇలా చేయడం పూర్తిగా చట్ట విరుద్ధం. వెంటనే చర్యలు తీసుకోవాలి. ఇది ఫ్యూడల్ హైదరాబాద్ కాదు' అని సీఎంవో, డీజీపీకి మరో నెటిజన్ విజ్ఞప్తి చేశారు.

2035 నాటికి 40వేల మోగావాట్ల గ్రీన్‌పవర్: భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2035నాటికి 40వేల మెగావాట్ల గ్రీన్‌పవర్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నామని తెలిపారు. సోమవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో నిర్వహించిన నాలుగో ప్రపంచ గ్రీన్ ఎనర్జీ పెట్టుబడిదారుల సమ్మేళనానికి భట్టి రాష్ట్ర ప్రతినిధిగా హాజరయ్యారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను సదస్సులో భట్టి వివరించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక కారిడార్లు, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లుతున్నదని, ఇవి గ్రీన్‌పవర్ ఉత్పత్తికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రంలో 1500 నుంచి 3వేల మోగావాట్ల హైడ్రోజన్, జియోథర్మల్, 250 మెగావాట్ల మినీ హైడల్ విద్యుదుత్పత్తికి అవకాశముందని వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పలు సంస్థల ప్రతినిధులను భట్టి విక్రమార్క కోరారు. సమావేశానికి హాజరైన గిజ్, టాటా పవర్, సెంకార్ప్, వెల్‌స్పన్, రెన్యూపవర్, ఇండియన్ ఆయిల్, ఎన్‌హెచ్‌పీసీ, వోఎన్‌వైఎక్స్, హీరోపవర్, ఊర్జా ఎనర్జీ, కేజీపీఎం సంస్థల ప్రతినిధులతోనూ భట్టి భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎం వెంట విద్యుత్తు సంస్థల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, వరుణ్‌రెడ్డి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ తదితరులు ఉన్నారు.

పోలియో టీకా ప్రచారాన్ని ఆపేసిన తాలిబాన్లు

దుబాయ్, సెప్టెంబర్ 16: అఫ్గానిస్థాన్‌లో తాలిబాన్ సర్కార్ ఆ దేశంలో పోలియో వాక్సినేషన్ ప్రచారాన్ని నిలిపివేసిందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్‌లో టీకా ప్రచారాన్ని నిలిపివేయటం అఫ్గాన్‌లో పోలియో నిర్మూలనకు గట్టి దెబ్బగా ఐరాస అభిప్రాయపడింది. ప్రాణాంతకమైన, పక్షవాతానికి గురిచేసే వ్యాధిగా పేర్కొనే పోలియో వ్యాధి వ్యాప్తిని ప్రపంచంలో రెండు దేశాలు అడ్డుకోవటం లేదని, అందులో ఒకటి పాకిస్థాన్‌కాగా, రెండో దేశం అఫ్గాన్‌గా ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది.

లంచం బరువును బట్టే ఫైళ్లలో వేగం

ప్రభుత్వ వ్యవస్థలో అవినీతిపై గడ్కరీ ధ్వజం

పుణే, సెప్టెంబర్ 16: ప్రభుత్వ వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతి విధానాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ధ్వజమెత్తారు. డబ్బు బరువుకు అనుకూలంగానే ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు కదులుతాయని విమర్శించారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని పుణేలోని ఒక కాలేజీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థల్లో ప్రతి పనికి, నిర్ణయం తీసుకునేందుకు నిర్దేశిత కాల పరిమితి విధించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా హైవే ప్రాజెక్టులు, రోడ్డు ప్రమాదాలు, ఆ ప్రమాదాల్లో మరణాలను ప్రస్తావిస్తూ వీటికి ఇతర అంశాల కన్నా ప్రాజెక్టు రిపోర్టుల్లో తప్పులే అసలు కారణం చెప్పారు. అంతేకాకుండా మన విధానంలో ప్రతి పనికి ఆర్డర్లు కోరే అధికారులుంటారని, వీరు రోడ్లపై గోతులు పూడ్చడానికి కూడా అనుజ్ఞ కావాలంటారని ఆయన అన్నారు. ఎక్కడైతే అధికారులకు డబ్బులు ముడతాయో అక్కడ పనులు చకచకా జరుగుతాయని, లేకపోతే అంతే సంగతులని అన్నారు. మన వ్యవస్థలో కొందరు న్యూటన్ తండ్రులు ఉంటారని, వారి దగ్గర మీరు డబ్బుల బరువు ఎంత ఎక్కువ పెడతారో అంతే వేగంగా మీ ఫైళ్లు పరిగెడతాయన్నారు.

ఏదీ ఆ దూకుడు?!

ఎన్డీఏ సంకీర్ణ సర్కారుకు వంద రోజులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 16: నమస్తే తెలంగాణ: ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి సోమవారానికి వంద రోజులు పూర్తయ్యాయి. గడిచిన పదేండ్లలో కనిపించిన దూకుడు ఇప్పటి ఎన్డీఏ 3.0 సర్కారులో కనిపించట్లేదన్నది కాదనలేని సత్యం. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఊహించని స్థాయిలో సీట్లు తగ్గిపోయిన ప్రభావమో, మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతుండటం వల్లనో కానీ ఏదైనా నిర్ణయంపై వ్యతిరేకత వస్తే ఎన్డీఏ ప్రభుత్వం పీఛేముడ్ అంటున్నది. ధరల నియంత్రణ, ఉద్యోగాల కల్పన, బడ్జెట్ విషయంలోనూ సర్కారు తన మార్కును చూపించలేకపోయింది. వెరసి ఎన్డీఏ 3.0 వంద రోజుల పాలనలో ఎలాంటి మెరుపులు కనిపించకపోయినా.. ప్రభుత్వాన్ని కాపాడుకోవాలన్న భయం మాత్రం కనిపిస్తున్నదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మిత్రులను సంతోషపెట్టాలని..

- ఎక్కడ అసమ్మతి వచ్చినా మొగ్గలోనే తుంచేయడం లేదా వ్యతిరేకించిన వారిని పక్కనపెట్టడమే పాలసీగా ఇప్పటివరకూ అనుసరించిన ప్రధాని మోదీ తన వైఖరిని మార్చుకొన్నట్టు కనిపిస్తున్నది. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల కోసం విడుదల చేసిన అభ్యర్థుల తొలి జాబితాను వెనక్కి తీసుకోవడం ఇందులో భాగమే. అంతేకాదు. గడిచిన పదేండ్లలో సొంతమెజార్టీ ఉండటంతో మిత్రపక్షాలను లెక్కచేయని ప్రధాని మోదీ.. ఇప్పటి సంకీర్ణ సర్కారుకు కీలకంగా మారిన బీహార్, ఏపీకి బడ్జెట్‌లో పెద్దయెత్తున నిధులను మంజూరు చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎన్డీఏ మిత్రులను సంతోషపెట్టి, సంకీర్ణ సర్కారును కాపాడుకోవడానికే మోదీ ఇలా చేశారని విశ్లేషకులు చెప్తున్నారు.

పాలసీల్లో యూటర్న్

- కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రసార సేవల (నియంత్రణ) చట్టం చేయాలనుకుంది. ముసాయిదా రూపొందించి స్టేక్‌హోల్డర్లకు పంపించింది. అయితే, ఈ బిల్లు స్వతంత్ర జర్నలిస్టుల గొంతునొక్కేలా ఉందనే విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్రం ఈ ముసాయిదా బిల్లును వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించింది.
- వక్ఫ్(సవరణ) బిల్లు విషయంలోనూ ఇలానే జరిగింది. వక్ఫ్ బోర్డు వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ మోదీ ప్రభుత్వం చట్టం చేయాలనుకుంది. అయితే, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అనేక పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. దీంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ ప్యానెల్ పరిశీలనకు ప్రభుత్వం పంపించాల్సి వచ్చింది.
- స్థిరాస్తుల అమ్మకాలపై వచ్చే లాభాలపై విధించే మూలధన లాభాల పన్నులో ఇండెక్సేషన్ ప్రయోజనం విషయంలోనూ వ్యతిరేకత రావడంతో కేంద్రం వెనక్కు తగ్గింది. ఇండెక్సేషన్ ప్రయోజనం లేని కొత్త విధానం, పాత పన్ను విధానంలో ఏదైనా ఎంచుకునే వెసులుబాటును ప్రజలకు కల్పించింది.
- ల్యాటరల్ ఎంట్రీ విషయంలోనూ ఇదే జరిగింది. 2018లోనూ ఈ విధానంలో కేంద్రం పలు నియామకాలు చేపట్టింది. అప్పుడు విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. ఇప్పుడు మాత్రం చిరాగ్ పాశ్వాన్ వంటి ఎన్డీఏలోని నేతలే వ్యతిరేకించడంతో వెనక్కు తగ్గక తప్పలేదు.

రీల్స్ కోసం నడిరోడ్డుపై శవంలా!

యూపీలో యువకుల అరెస్ట్

లక్నో, సెప్టెంబర్ 16: యూపీ పోలీసులు నడిరోడ్డుపై పడి ఉన్న ఒక శవాన్ని అరెస్ట్ చేశారు. శవమంటే నిజంగా శవం కాదు. సామాజిక మాధ్యమంలో పేరు తెచ్చుకోవడానికి కస్గంజ్ జిల్లాలో నడిరోడ్డుపై శవంలా పడుకున్న ముకేశ్ కుమార్, స్నేహితులైన కొందరు యువకులను అరెస్ట్ చేశారు. ఇతడు ఎర్రటి చాపపై పడుకుని ఉండగా, మెడలో దండ వేసి ఒంటిపై తెల్లటి గుడ్డ కప్పారు. అతని ముక్కులో దూది కూడా పెట్టి అతడిని అచ్చం శవంలా నడిరోడ్డుపై ఉంచిన అతని స్నేహితులు ఇన్‌స్టాలో రీల్ కోసం దానిని వీడియో తీయడం ప్రారంభించారు. దీంతో పెద్దయెత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ముకేశ్ కుమార్, స్నేహితులను అరెస్ట్ చేశారు. దీనిపై సామాజిక మాధ్యమంలో పలువురు విమర్శలతో విరుచుకుపడ్డారు. వ్యూలు, లైక్‌ల కోసం వీరు ఏమన్నా చేస్తారు అని ఒకరు, ఇలాంటి చర్యల ద్వారా వీరు సమాజానికి చాలా చెడు సందేశాన్ని ఇస్తున్నారు, ప్రపంచమంతా ఇలాంటి వింత, పిచ్చి మనుషులతో నిండిపోతున్నది అని మరికొందరు కామెంట్లు చేశారు.

ఇబ్బందుల్లో భారతీయ ముస్లింలు

- వారిని పట్టించుకోకపోతే మనం ముస్లింలమే కాము
- ఇరాన్ అధినేత ఖమేనీ వ్యాఖ్యలు
- ముందు మీ సంగతి చూసుకోండి
- ఘాటుగా స్పందించిన భారత్

న్యూఢిల్లీ: ఇరాన్ అధినేత అయతుల్లా ఖమేనీ భారతీయ ముస్లింలపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. 'ఇస్లామిక్ సమాజంగా మన ఉమ్మడి గుర్తింపు పట్ల మనం ఉదాసీనంగా ఉండేలా చేయడానికి ఇస్లాం శత్రువులు ఎల్ల వేళలా ప్రయత్నిస్తున్నారు. మయన్మార్, గాజా, ఇండియా లేదా ఏదైనా ఇతర ప్రదేశంలో ఓ ముస్లిం అనుభవిస్తున్న ఇబ్బందులను పట్టించుకోకపోతే మనల్ని మనం ముస్లింలుగా పరిగణించుకోలేం' అని ఖమేనీ చెప్పారు. మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత్ ఘాటుగా స్పందించింది. 'ఇరాన్ సుప్రీం లీడర్ భారత దేశంలోని మైనారిటీల గురించి చేసిన వ్యాఖ్యలు మమ్మల్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేశాయి. అవి తప్పుడు సమాచారంతో కూడినవి. ఆమోదయోగ్యం కానివి. మైనారిటీల పట్ల వ్యవహరించడం గురించి విమర్శించే దేశాలు మొదట తమ దేశాల్లోని మానవ హక్కుల రికార్డులను పరిశీలించుకోవాలి' అని సలహా ఇచ్చింది.

విజయేంద్రను బీజేపీ అధ్యక్షుడిగా అంగీకరించం

మాజీ మంత్రి రమేశ్ జార్కిహోళి

బెంగళూరు, సెప్టెంబర్ 16: కర్ణాటక బీజేపీ అధ్యక్షుడిగా బీవై విజయేంద్ర నాయకత్వాన్ని తాము ఎంతమాత్రం ఒప్పుకోబోమని మాజీ మంత్రి, గోకక్ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళి స్పష్టం చేశారు. విజయేంద్ర పార్టీలో జూనియరే కాక, అవినీతిపరుడన్న ముద్ర కూడా ఉందని ఆయన అన్నారు. పైగా అతనికి ఎలాంటి భావజాలం లేదని, ఈ క్రమంలో తదుపరి అధ్యక్షుడు ఎవరన్న దానిపై అధిష్ఠానం పునరాలోచన చేయాలని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధ్యక్షుడిగా విజయేంద్ర కొనసాగడాన్ని వ్యతిరేకిస్తానని అన్నారు.

చైనాలో 'బెబింకా' బీభత్సం

బీజింగ్, సెప్టెంబర్ 16: గత 75 ఏండ్లలో ఎన్నడూ లేనంత భీకరమైన తుఫాన్ చైనాను తాకింది. సోమవారం ఉదయం టైఫూన్ 'బెబింకా' చైనా ఆర్థిక రాజధాని షాంఘైలో తీరాన్ని దాటింది. దాదాపు 2.5 కోట్ల జనాభా కలిగిన షాంఘై నగర జనజీవనం ఒక్కసారిగా స్తంభించిపోయింది. ఇక్కడి జాతీయ రహదారుల్ని మూసేయించారు. షాంఘైలో రెండు విమానాశ్రాయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన విమానాలన్నీ రద్దయ్యాయి. విమాన ప్రయాణికులకు తాత్కాలిక బస ఏర్పాటుచేసినట్టు అధికారులు ప్రకటించారు. ఆది, సోమ రెండు రోజులపాటు షాంఘై రైల్వే స్టేషన్ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసింది. తూర్పు చైనాలోని అహూయి ప్రావిన్స్‌కు లెవల్-4 స్థాయి, షాంఘై, యిజియాంగ్ నగరాలకు లెవల్-3 ప్రమాద హెచ్చరికలు జారీచేసినట్టు 'జిన్హువా' న్యూస్ ఏజెన్సీ తెలిపింది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో 4,14,000 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఎట్టకేలకు మమతతో జూడాల చర్చలు

సీఎం ముందు ఐదు డిమాండ్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 16: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ల ఆందోళన కొలిక్కి వస్తున్నది. నాలుగుసార్లు రద్దు అయిన తర్వాత సోమవారం రాత్రి జూనియర్ డాక్టర్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో చర్చలు జరిపారు. 30 మంది వైద్యుల బృందం దాదాపు రెండున్నర గంటల పాటు సీఎం సహా ఉన్నతాధికారులతో సమావేశమైంది. చర్చల వివరాలను నమోదు చేసేందుకు తమతో పాటు ఇ